# అపార్థం

## జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం.

ఉదయం భవాని అన్న మాటలు విన్న దగ్గర్నుంచి విశ్వనాథంగారి మనస్సు బాధతో విలవిలలాడింది

అబ్బా మీ నాన్నగారితో చచ్చిపోతున్నానండి ఆయన్ని ఏదన్నా ఓల్డ్‌హోంలో చేర్పరాదు నాకు కొంత ప్రశాంతంగాను, తెరిపిగాను వుంటుంది అసలే పిల్లలతో వేగలేక చస్తుంటే - మధ్య ఆయన ఒకరు మీకేం పొద్దుననగా వెడతారు రాత్రికి వస్తారు మధ్యలో నా బాధ మీ కర్థం గాదు' భాస్కరంతో భవానీ అంటున్న మాటలివి.

"ఏమిటా మాటలు భవానీ ఆయన వింటే ఏమనుకుంటారు భాస్కరం మందలిస్తున్నాడు

'మీరుండండి ఇంట్లో ఒక్క రోజు - తెలుస్తుంది" నిష్ఠూరంగా అంటున్నది

'చాల్లే వూరుకో వెళ్ళి పని చూసుకో" -కోప్పడ్డాడు భాస్కరం

ఏమో బాబు నేను భరించలేను నావల్లగాదు "

వాలు కుర్చీలో పడుకుని పేపరు చూస్తున్న విశ్వనాథంగారు విన్న మాటలవ్వి

తనవల్ల భవాని పడే ఇబ్బందేమిటో అర్థంగాలే దాయనకు తనకి ఆమె ఏ పని చెయ్యక్కరలేదే తన పనులన్నీ తాను చేసుకోగలడే ఆమె చేసేదల్లా భోజనం వండి వడ్డించటమే మరి ఆమెకి ఏమిటి తనవల్ల ఇబ్బంది ఎంత ఆలోచించినా అర్థంగాలేదాయనకు

ఆలోచిస్తూ, మౌనంగా ఆరోజల్లా గడిపేశారు ఓ రాత్రివేళ మెలకువ వచ్చింది సన్నగా, కీలగా వెక్కిళ్ళు వినవస్తున్నాయి భవాని ఏడుస్తోందిలా వుంది ఎందుకో అర్థం గాలేదు ఇంతలో సన్నగా భాస్కరం గొంతు వినబడుతోంది

"ఇంతకాలం చెప్పలేదేం మరి అనునయంగా అడుగుతున్నాడు

మీరేమనుకుంటారోనని - పైగా నా మాట నమ్మవద్దూ ఆ ముసలాయన వుండటం ఇష్టంలేక నేనే అల్లరి చేస్తున్నానని అనుకుంటారని ఆ అప్రదిష్టని కడుపులో దిగమింగుకుని మీతో ఓల్డ్‌హోంలో చేర్చమని పోరు పెడుతోంది "

ఆపై మాటలు ఆయనకి వినరాలేదు అంత అప్రదిష్టపని తానేం చేశాడో అర్థంగాలేదు మరీ మరీ ఆలోచించాడు. స్ఫురణకి ఏదీ రావటం లేదు కానీ ఒకటి మాత్రం అర్థమైందాయనకు తనవల్ల భవాని మనస్సు గాయపడింది లేకుంటే మునుపెన్నడూ తన విషయంలో ఇలా మాట్లాడలేదు. ఏది ఏమైనా జాగ్రత్తగా వుండాలి ఇకనుంచి తనవల్ల వాళ్ళకి ఏ ఇబ్బంది కల్గకూడదు మనస్సులోనే నిర్ణయించుకున్నాడు ఐనా తానేమి చిన్న చితక కాదే. అరవై ఏళ్ళు పైబడ్డాయి జీవితంలో ఎన్నో కష్ట నష్టాల్ని ఎదుర్కొన్నాడు ఎన్నో చేదు అనుభవాల్ని మింగేడు మరి ఏమిటి తను చేసిన అపచారం!!

ఆయనకి గతం కళ్ళ ముందు కదిలింది

ఊహ తెలియని వయస్సులోనే తనకి వివాహమైంది భార్య కాపురానికి వచ్చేటప్పటికి పదహారేళ్ళ వయసువాడైనాడు. దబ్బ పండులా మిసమిస లాడుతూ వుండేవాడు. తన భార్య సీత నిజంగా సీతాదేవి తనతో ఎన్నో కష్టాలు పంచుకుంది పద్ధెనిమిదో సంవత్సరం తనకి వచ్చేటప్పటికి తనని ఆడ పిల్ల తండ్రిని చేసింది

బొద్దుగా, ముద్దుగా, తెల్ల జామపండులా వుంది పాపాయి చాలా ముచ్చటగా వుండేది కళ్యాణి అని పేరు పెట్టేడు తను తను జీవితంలో స్థిరపడ్డాడు స్కూలు మాష్టరుగా మూడేళ్ళ వరకు తన జీవితం సాఫీగానే సాగిపోయింది.

కానీ- ఆరోజు - మరిచిపోలేని దుర్దినం- 'తను వూరెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి సీత ఏడుస్తోంది కళ్యాణి చాపమీద పడుకోబెట్టి వుంది ఇంటినిండా జనం తను'ఆత్రంగా లోపలికి పరిగెత్తేడు మనస్సు కీడు శంకిస్తుంటే. చుట్టూతా వున్న జనం దారి వదిలేరు ముందుకివంగి పాపాయిని చేత్తో ఎత్తుకున్నాడు చల్లగా, నిర్జీవంగా తగిలింది తన గుండె లవిసాయి దుఃఖం పొంగి పొర్లింది తనని పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది సీత

"ఎలా జరిగింది" అడిగేడు తను కూడదీసుకుని దుఃఖం దిగమింగుకుని

'పాలలో ఏదో కల్సిందిలా వుంది పాపం ఆ ఇల్లాలు మామూలుగానే పట్టిందట తర్వాత చూచిందట చచ్చిన బల్లిని సీసాలో ఎవరో చెబుతున్నారు

తనకి బాధ సుడులు తిరిగింది నిండా మూడేళ్ళన్నా నిండని పాప చాలా బాధ కల్గింది తనకి సీతని సముదాయించలేకపోయాడు 'దానికి ఆయువు తీరిపోయింది మనం నిమిత్తమాత్రులం మన చేతుల్లో ఏముంది అంతా పైవాడి దయ దాన్ని పెంచి, ముద్దు మురిపాలు చూసుకునే అదృష్టం మనకి లేదు వూరుకో వూరుకో "

సీతకి ఆ గాయం మానటానికి ఒక సంవత్సరం పట్టింది కానీ తనవల్ల గాలేదు. అనుక్షణం కల్యాణి తలపులు మరచిపోలేని ఆ అందమైన రూపం కళ్ళ ముందు కదలాడేది తనకి యాంత్రికంగా జీవితం జరుపుకొస్తున్నారు అదిగో అప్పుడే భాస్కరం మూడు నెలల పసిగుడ్డుగా తన ఇంటికి చేరాడు సీత కొంత ఉపశమనం పొందింది వాడి ఆలన పాలనలో కొంత వూరట చెందింది, తనకీ కొంత సంతోషమైంది సీతలో మునుపటి కళాకాంతులు విరియటంతో

అదిగో అప్పుడే హఠాత్తుగా మరో గాయం తగిలింది తనకు సీత తనకి చెప్పకుండానే దిగంతాల అవలకి వెళ్ళిపోయింది ఒంటరివాడైనాడు తను అప్పటినుంచి భాస్కరాన్ని తల్లీ, తండ్రీ తానే సాకేడు చుట్టాలందరూ మళ్ళీ పెళ్ళి చేసుకోమని వత్తిడి చేశారు ఊహు తను కాదని ససేమిరా వప్పుకోలేదు భాస్కరంతోడిదే జీవిత మైంది తనకు వాడి ఆలన పాలనలో కాలం గడిపేస్తూ, కష్టాల్ని, సుడి గుండాల్ని అధిగమించేడు

కానీ - కల్యాణిని మాత్రం మరచిపోలేకపోయే వాడు ప్రతి రాత్రి సీత ఫోటో ముందుంచుకుని కళ్యాణి ఫోటో చూపిస్తూ బోలెడన్ని కబుర్లు చెప్పేవాడు అమె బ్రతికివున్నట్టుగానే మాట్లాడే వాడు ఎన్నెన్నో వూసులుచెప్పేవాడు

ఇవేమి భాస్కరంకి తెలియదు చిన్నతనం ఊహ తెలియని పసి మనస్సు కానీ భాస్కరానికి ఏ కొరతా చెయ్యలేదు ఈలోపు బదిలీమీద బదిలీలు అలా ఎన్నెన్నో వూళ్ళు తిరిగేడు భాస్కరంతో రోజూ పడుకోబోయేముందు కళ్యాణిని గుర్తుకు తెచ్చుకునేవాడు సీతనన్నా మరిచిపోయేడుగాని తను కళ్యాణిని మరచిపోలేకపోయాడు ప్రతి నిత్యం అమె పేరును మనస్సులోనే స్మరించుకునేవాడు భాస్కరాన్ని ప్రేమగానే సాకేవాడు అతనికి అమ్మ అమ్మైందీ సొంత బిడ్డగానే చూశాడు అలా ఎన్నో రోజులు - కాదు - సంవత్సరాలు - భాస్కరం పెరిగి పెద్దవాడైనాడు డిగ్రీ చేతికొచ్చింది ఉద్యోగం దొరికింది- తనకి రిటైరైయింది

భాస్కరాన్ని ఒక ఇంటివాడ్ని చేశాడు ఐనా తాను కళ్యాణిని మాత్రం మరిచిపోలేకపోయాడు ఈ నిజాన్ని ఏరోజూ భాస్కరానికి చెప్పలేదు ఇన్నేళ్ళుగా

తొలి కోడి కూసింది విశ్వనాథంగారు లేచారు లేచి టీపాయిమీదకి దృష్టి సారించేడు రోజూ పాల

పాకెట్లోకి అక్కడ డబ్బులుంచటం భవానీ అలవాటు ఈవేళ లేవు తలుపు తట్టక తప్పలేదు


'అమ్మా అమ్మా భవానీ!'

లేచి తలుపు తీసింది భవానీ

పాలకి డబ్బులివ్వమ్మా! రాత్రి టీపాయిమీద వుంచటం మరిచిపోయేవులా వుంది!' చెప్పేడు నమ్రతగా ఆమె ముఖం వంక చూశాడు కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి ఏడ్చిందేమో ముఖం వుబ్బిపోయింది

ఏం అమ్మా అలా వున్నావు రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదా! అప్యాయంగా అడిగేడు

భవాని మౌనంగా లోపలికి వెళ్ళి డబ్బులు తెచ్చి



యిచ్చింది.

విశ్వనాథంగారు తీవ్ర మనస్థాపానికి గురైనారు తనవల్ల జరిగిన అనర్ధమేమిటో మాత్రం ఆయనకి తెలియరాలేదు ఆలోచనలతోటే పాలకి వెళ్ళి వచ్చేడు స్నానం చేస్తున్నా- పూజ చేస్తున్నా- అదే ఆలోచన మనస్సు నిలవనీయటంలేదు ఏమీ అంతు పట్టడం లేదు ఆ మధ్యాహ్నానికి ఒక స్థిర నిశ్చయానికి వచ్చేడాయన అప్పుడు కునుకు పట్టింది ప్రశాంతంగా నిద్రపోయాడు.

నాల్గు గంటలకి లేవంగానే భవాని టీ తెచ్చి ఇచ్చింది. త్రాగి వీధి వరండాలో కూర్చున్నాడు. ఖాళీ టీ కప్పు కోసం వచ్చిన భవానిని "అమ్మా కళ్యాణి రావటం లేదేం మనింటికి" అడిగేడు

భవానీ ముఖం మాడిపోయింది. నిర్లిప్తంగా లోపలికి వెళ్ళిపోయింది

మౌనంగా వెళ్ళిపోతున్న భవాని వంక చూస్తూ అనుకున్నాడు- కోడలి మనస్సు విరిగిపోయింది తన విషయంలో ఐనా ఇంకెన్ని రోజులులే . . రేపోమాపో వెళ్ళిపోతున్నానుగదా!

పుట్టి పెరిగిన పల్లెకి తనకీ ఆ గడ్డమీద గడపటం ఇష్టమే కన్నతల్లిలాంటి వూరు తనకి జన్మ ఇచ్చిన ఇల్లు- నా వూరు- నా ఇల్లు- నలభై సంవత్సరాల తర్వాత వెళుతున్నందుకు ఆయన కళ్ళు ఆనందంతో చిప్పిల్లాయి

ఇంటిమీదకి ఆలోచనలు మళ్ళాయి

ఇప్పుడెలావుందో ఇల్లు! జీర్ణమై శిథిలావస్థలో వుందో- అసలు లేదో ఏదో తెలియని బాధ అయన్ని కమ్ముకుంది

చీకటి పడింది

భాస్కరం వచ్చేడు - టీ త్రాగి- తను ఒక కుర్చీ తీసుకుని విశ్వనాథంగార్కి ఎదురుగా కూర్చున్నాడు

భాస్కరం ముఖంలోకి చూశాడాయన కొడుకు తనతో ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడని- ఎలా మొదలు పెట్టాలో అర్ధంగాక తటపటా యిస్తున్నాడని గ్రహించేడు.

"ఏం కన్నా అలా వున్నావు ఆఫీసులో పని వత్తిడిగా వుందా?" అప్యాయంగా అడిగేడు

'లేదు మామూలుగానే వున్నానే'

"ఎందుకురా కన్నా. తండ్రి ఎదుట అబద్ధాలు ఆడతావు ఎప్పుడు నేర్చుకున్నావు'

* * * * * * * *

తల వంచుకుని వెళ్ళిపోతున్న భాస్కరాన్ని ఉద్దేశించి - "నువ్వేదో చెప్పాలని వచ్చేవులా వుంది చెప్పు కన్నా.... నా దగ్గర దాపరికమెందుకు "నాకు నీవు. నీకు నేనుగా" బ్రతికాం. నా దగ్గిర సందేహమెందుకు."

Someswar.

తలవంచుకుని సందేహంగానే చెప్పాడు భాస్కరం

'నాన్నా' మీరేమి అనుకోకండి నన్ను అపార్థం చేసుకోకండి చేసుకుంటే నామీద ఒట్టే 'ఆ మాటలు చెప్పేటప్పటికి భాస్కరం గొంతు పూడుకుపోయింది

భాస్కరం భుజం తట్టేడు విశ్వనాథంగారు చెప్పమన్నట్లు సంజ్ఞ చేశాడు చేతులలో - దాదాపు ఆయన పరిస్థితి కూడా అలాగే వుంది కొడుకుని పూరెడతానని అడగటమెలా అని?

'చుట్టుప్రక్కల వాళ్ళు చెవులు కొరుక్కుంటున్నారు మీ గురించి - నాకు తెల్సు మీ మంచితనం - వాళ్ళకి తెలియదుగదా- నల్గురిలో బ్రతకాల్సిన వాళ్ళంగదా! మీరాలోచించండి"

'ఏమనికన్నా అడిగేడాయన ప్రశాంతంగా.

'అదే అదే. ఆ కళ్యాణిగారిని తదేకం చూస్తున్నారని- ఆమె చెంపలు పుణికి పుచ్చుకున్నారని- మీ క్యారెక్టరు మంచిదికాదు అని - రకరకాలుగా చెప్పలేక చెప్పేడు భాస్కరం

నవ్వేడు విశ్వనాథంగారు

సరే ఇంతకీ నువ్వేమనుకుంటున్నావో చెప్పలేదు'

"నేనేమ అనుకోటం లేదు మీమీద నా కెన్నడూ దురభిప్రాయం లేదు"

"అమ్మాయికుందా

లేదు కానీ బాధ పడుతోంది మొన్న పేరంటానికి పిలుస్తే ఎవ్వరూ రాలేదుట హేళనగా, భయంగా, నిరసనగా, రకరకాలుగా మాట్లాడారట అందరూ ..!"

"మరి నీ వీ సమస్యని ఎలా పరిష్కరించాలనుకుంటున్నావు'- సూటిగా అడిగేడాయన

"కొంతకాలం పల్లెలో వుండి రండి ప్రతినెలా కొంత డబ్బు పంపిస్తాను" తలవంచుకుని అన్నాడు

అలాగే - తాపీగా అన్నాడాయన

తండ్రిని ఎలా ఒప్పించాలాన్న బెంగతో ఇప్పటిదాక సతమతమ్మైన భాస్కరానికి తండ్రి తేలిగ్గా ఒప్పుకోటంతో హాయిగా గాలి పీల్చుకున్నాడు

భాస్కరం నేను మధ్యాహ్నమే ఆ నిర్ణయానికి వచ్చేను రేపు వెళ్ళిపోతాను కానీ నాదొక చిన్న కోరిక.

'చెప్పండి తటపటాయిస్తూనే అన్నాడు బాస్కరం

"చివరిసారిగా కళ్యాణిని చూడాలని వుందిరా! ఆమెతో మాట్లాడాలని వుందిరా!"

వెయ్యి పిడుగులు తలమీద పడ్డట్లయింది భాస్కరానికి

గుమ్మంలో నుంచుని సంభాషణ ఆలకిస్తున్న భవానీ ఉలిక్కి పడింది

చచ్చినా మీ గడప తొక్కనని శపథం చేసింది కళ్యాణి తూలనాడి, విసురుగా వెళ్ళిపోయింది నెల రోజుల క్రితం అలాంటి కళ్యాణి పిలిస్తే మాత్రం తన ఇంటికి వస్తుందా? బవాని ఆలోచనలో పడింది

రాదు రాదు ' భాస్కరం అంతరాత్మ ఘోష పెట్టింది అసలైనా ఏ ముఖం పెటుకుని వెళ్ళి

# అపార్థం

రావాలి ఆమె దగ్గరికి? ఏమని అడగాలి! ఇప్పటికే పేట పేటంతా తమని చూసి అసహ్యించుకుంటూ, చాటుగా గుసగుసలాడుకుంటున్నారు

ఆ కోరిక ఎటూ నెరవేరదని - అప్పుడు తను ఇక్కడినుంచి కదలక్కరలేదని ముసలాడు వేసిన పాచిక - పథకం అనుకుంది భవానీ 'అమ్మ ముసలాడా ఎంత టక్కరివి,మనస్సులో అనుకుంది

ముగ్గురిమధ్య చాలాసేపు మౌనం తాండవించింది వులుకు - పలుకు లేకుండా వున్న కొడుకు - కోడల్ని చూసి- సరే మీవల్లగాదు నేనే వెళ్ళి పట్టాడి వస్తాను " లేచాడు విశ్వనాథం

తెల్లబోయి చూస్తుండిపోయా రిద్దరూ

గేటు తీసుకుని కళ్యాణి ఇంట్లోకి వెడుతున్న మామగారిని చూసి భయపడింది 'ఏం గొడవ తెస్తాడో అని' మనస్సులోనే కోటి దేవుళ్ళకి మొక్కుకుంది కాపాడమని-

గంట తర్వాత- నవ్వుతూ వచ్చిన మామగారిని చూస్తే చిరాకేసింది భవానీకి

అప్పటిదాకా అనిశ్చితంగా గడిపిన భాస్కరం మనస్సు కుదుటబడింది ఏ గొడవ జరగనందుకు కళ్యాణి కేకలు వేసి అల్లరిచేసి మెడబట్టి గెంటుతుందని ఊహించేడు అప్పటిదాకా

బొమ్మల్లా, చేష్టలుడిగి చూస్తున్న కొడుకు - కోడలిని చూసి -"అమ్మా రేపు నా ప్రయాణానికి కావల్సిన ఏర్పాట్లు చూడమ్మా" అంటూ కళ్ళజోడు తీసి టేబుల్‌మీద వుంచి స్నానానికి వెళ్ళిపోయాడు విశ్వనాథంగారు

ఉదయాన్నే విశ్వనాథంగారు వెళ్ళిపోయారు

భవానీ మనస్సు తేలిక పడింది చాలా తృప్తిగా, హాయిగా ఆ మధ్యాహ్నం గడుపుకుంది

అప్పుడు వచ్చింది కళ్యాణి

ముందు ఆశ్చర్యపోయింది తర్వాత రండి రండి అంటూ ఆహ్వానించింది

చుట్టూతా పరికించి చూస్తున్న కళ్యాణితో అంది భవాని, "మా మామగారు వెళ్ళిపోయారు భయం లేదు ఆయన చేసిన పనికి సిగ్గు




పడుతున్నాం మమ్మల్ని మనస్ఫూర్తిగా క్షమించండి కళ్యాణి రెండు చేతులూ పట్టుకుని అంది

"అయ్యయ్యో వెళ్ళిపోయారా" నొచ్చుకుంటూ అంది ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి మీరే నన్ను క్షమించాలి అనవసరంగా ఆ ముసలాయన్ని అపార్థం చేసుకున్నాను రాత్రి మా ఇంటికివస్తే మొదట భయపడ్డాను కానీ - అమ్మా అనిపిలిచి ఆయన చెప్పిన కథ విన్నాక ఏడ్చేశాను ఆయన్ని క్షమార్పణలు అడుగుదామని వచ్చాను నావల్ల ఆయనకి ఎంత అపకారం జరిగింది కొడుకు - కోడలివద్ద తలదాచుకు హాయిగా ప్రశాంతంగా బ్రతుకుతున్న ఆయన్ని మీనుండి దూరం చేశాను ఈవృద్ధాప్యంలో ఆయన్ని ఒంటరిగా, తుఫాను తాకిడికి వూగిసలాడే కొబ్బరిచెట్టులా చేశాను నావల్ల ఆయనకి తీరని అపకారం జరిగింది నా పాపానికి నిష్కృతి లేదు"- వలవల ఏడ్చింది కళ్యాణి

అర్థం గాలేదు భవానికి ఈ హటాత్పరిణామం చెప్పిందామె "మీవారు ఆయన కన్న కొడుకు కారట వీధి బడి ముందు పడివుంటే తెచ్చి పెంచారట ముందు కళ్యాణి అనే పాపాయి పుట్టి పోయిందట ఆ పాపాయి అచ్చం ఇప్పుడు నేనెలా వున్నానో అలాగే వుండేదట ఆ పిల్లమీద మమకారం చంపుకోలేక ప్రతి రోజూ తల్చుకుంటారట ఆ రోజు నన్ను చూడగానే పాపాయి గుర్తుకు వచ్చిందిట అందుకే అచేతనావస్థలో నన్ను .పాపాయిగానే భావించి ముద్దు పెట్టుకున్నారట. ఏదో ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయారట నేను నమ్మలేదు కానీ ఈ ఫొటో చూడండి అచ్చం నాలానే వుంది-" భవాని చేతిలో వుంచిందామె ఫోటోని

బవాని నిశ్చేష్టురాలైంది హిస్టీరియా పేషెంటులా వుండిపోయింది తన భర్త ఆయన సొంత కొడుకు కాదనే విషయం ఆమెకి నమ్మకం కుదరలేదు ఏదో కలలా అనిపిస్తోంది

నెమ్మదిగా తలయెత్తి ఫోటో వంక చూసింది ఆమె చాలా ఆశ్చర్యపోయింది ఇప్పటి కళ్యాణికి- అప్పటి కళ్యాణికి ఏమీ తేడా లేదు ముమ్మూర్తులా ఇద్దరూ ఒక్కటే ఇది వాస్తవమేనా అనిపించింది కళ్ళముందు కనబడుతున్న "నిజం నిరూపించింది

మామయ్యా నన్ను క్షమించండి - అపార్థం చేసుకొని మీకు ఎంత ద్రోహం చేసేను-" ఆమె గుండె ఆక్రోశించింది

ఆ రాత్రి బార్య చెప్పిందంతా విన్న భాస్కరానికి మతి పోయింది తనతో ఏనాడూ తను సొంత బిడ్డ కాదని అనలేదు ప్రవర్తించలేదు కనీసం ఆ చాయలు కూడా వెలువరించలేదు తనెంత అపార్థం చేసుకున్నాడు మనస్సు విలవిలలాడింది మూగగా రోదించేడు

ముందు మీరు వెళ్ళి మామయ్యని తీసుకురండి' తొందరపెట్టింది భవానీ

వడివడిగా పల్లెకి బయలు దేరాడు భాస్కరం విశ్వనాథంగారి పాదాలని తన కన్నీళ్ళతో అబిషేకించాలని- □